# 32. రోగ సాహితి

పెళ్ళిళ్ళ సీజన్లో నవదంపతులకు ప్రెజెంట్ చేసేందుగ్గాను హోల్ సేల్ గా ఓ నాలుగయిదు కిలోల నవలలు కొందామని బుక్ స్టాలుకు వెళ్ళేను.

"లాభం లేదండీ! ఇప్పుడు ఒక్కో నవలా రెండేసి కిలోలకు తక్కువ ఉండటం లేదు. ధరలు కూడా మండిపోతున్నాయ్! మనలో మాట! ఈసారి పుస్తకాలు ప్రెజెంట్ చేయటంకన్నా వెండిగిన్నెలు ప్రెజెంట్ చేయటమే చౌక!" అన్నాడు బుక్ స్టాల్ మిత్రుడు.

నేను ఆలోచనలో పడటం చూసి దయదలచిట్లున్నాడు. "ఇంతకీ మీరు ఎలాంటి పెళ్ళిళ్ళకు వెళ్ళబోతుతున్నారు సార్!" అనడిగేడు.

"ఎన్నిరకాల పెళ్ళిళ్ళున్నాయేమిటీ?" అని తెల్లమొహం వేసేను.

మావాడు మందహాసం చేసేడు. "టేబిల్ పెళ్ళిళ్ళు, తివాచీ పెళ్ళిళ్లు, పందిరి పెళ్ళిళ్ళు, రిజిస్ట్రారాఫీసు పెళ్ళిళ్ళు, గ్రామఫోన్ రికార్డ్ పెళ్ళిళ్ళు, డప్పుధమారాల పెళ్ళిళ్ళు, మా బామ్మర్ది టైపు పెళ్ళిళ్ళు చాలా రకాలున్నాయండీ!"

"మీ బామ్మర్ది కైవపంటే?"

"మా బామ్మర్ది ఎస్సెల్సీ చదివేడు!"

"చదివి...?"

"ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజీలో రిజిస్టరు చేయించు కున్నాడు."

"ఇంకా ఉద్యోగం రాలేదా!"

"వచ్చింది! ఎదురింటి పిల్లను ప్రేమించటమే ఆ ఉద్యోగం.

"అచ్ఛా...!"

"వీడా పిల్లను గాఢంగా, చాలా తీరిగ్గా, రోజుకు ఇరవై నాలుగ్గంటల చొప్పున ఢాం, ఢామ్మని ప్రేమించేసే శాడు."

"మరి ఆ పిల్ల?"

"ఆ పిల్లక్కూడా చాలా తీరికే! హైస్కూలుకు వేసవి సెలవులు గదా! పాపం ఆ అమ్మాయి కూడా ఢాం, ఢాం మని మావాణ్ణి ప్రేమించేసింది.

"తర్వాత...?"

"ఏముందీ...ఓ అర్ధరాత్రి వాళ్ళిద్దరూ ఇళ్ళల్లోంచి మాయమయ్యేరు."

"ఎవరెత్తుకు పోయేరూ?"

జవాబుగా మావాడో పుస్తకం తీసి ముందుంచేడు. దాని పేరు "రోగజ్వాల". రెండు కిలోల బరువుంటుందని పించింది.

"ఈ రోగజ్వాల నవల వాళ్ళకి చాలా ఇష్టమట. చెరి పదిసార్లూ చదివేరుట. అందులో కూడా ఇలాగే ఇద్దరు ప్రేమ రోగ జ్వాలల్ని రగిలించుకుంటే పెద్దలు వీల్లేదని ఫైరింజన్ను పిలిపించేరుట.

"ఓహో! ఇద్దరూ ఓ కులంవాళ్ళు కాదా?"

"ఓ కులంవాళ్లేనండీ! అయితే అమ్మాయి తరపు పూర్వీకులు మూడు యజ్ఞాలుచేసిన ఘనాపాఠీలట. అబ్బాయి పూర్వీకులు ఒక్క యజ్ఞమే చేశారట!"

"ఆ మిగతా రెండు యజ్ఞాలూ ఈ ప్రేమరోగజ్వాలా బాలుడు చేస్తే సరిపోనుగా!"

"ఆ సంగతి సదరు రోగజ్వాల రచయిత్రికి తట్టనే లేదు సుమండీ! ఏమయితేనేం గాని మొత్తం మీద ఆ హీరో, హీరోయిన్లిద్దరూ పెద్దల కఠిన, క్రూర, కర్కశ, ధారుణ వ్యతిరేకతకు ప్రతిగా కిర్సనాయిల్ పోసుకుని జాయింటుగా కైలాస యాత్రకు వెళ్ళిపోయారు."

"ఈ కరువు రోజుల్లో అంత కిర్సనాయిల్ ఎక్కడ దొరికిందబ్బా! కాస్త అడ్రసు కనుక్కుందూ?"

"ఎవరి అడ్రసు ? ఆ రచయిత్రిగారు మీ కాలనీలోనే ఉన్నట్టుందే ?"

"సర్సరే ! మీ బామ్మర్ది సంగతి వదిలేశావ్ !

"అందుకని మా బామర్ది, వాడి హృదయేశ్వరీ కూడ బలుక్కుని ఓ అర్ధరాత్రి ఇళ్ళల్లోంచి మాయం అయ్యేరు."

"అదేం ఖర్మ ?"

"పెద్దల నడిగితే రోగజ్వాలలోలాగా ఫైరింజన్ని పిలిపిస్తారేమోనని వాళ్ల భయం లెండి !"

"అందుకని అర్ధరాత్రివేళ కిర్సనాయిల్ దుకాణం వెతుక్కుంటూ వెళ్లేరా ?"

"అబ్బే ! మా వాళ్ళు చాలా నవలలు చదివిన ఘనులెండి. వాళ్ళు సరాసరి తిరపతి వెళ్లి వెంకన్న సమక్షంలో ఉంగరాలు మార్చేసుకున్నారు. మావాడో పసుపుతాడు ఆ పిల్ల మెళ్లో బిగించేశాడు."

"తర్వాత...?"

"సరాసరి మా యింటికొచ్చి నా దుకాణంలో నవలల్ని జాయింట్‌గానూ, ఫ్రీగానూ చదివి పారేయసాగేరు."

"ఇంకా ఇక్కడే ఉన్నారా ? నాకోసారి చూపించ రాదూ !"

''ఎబ్బె! లేరు: ప్రస్తుతం ఊటీలో యుగళ గీతాలు పాడుకుంటున్నారు!"

''నువ్వు చాలా ఉదారుడివోయ్! వాళ్లకు ఊటీ టిక్కెట్లు కొనిపెట్టావన్నమాట!

"నో! నో! నేనేం కొన్లేదు. నాక్కూడా కొంటాం రమ్మని వాళ్లే అడిగేరు."

"అంత డబ్బెక్కడిదీ?"

"అదో చిన్న నవల! వాళ్లు పరారైన అర్ధరాత్రికి నాలుగో తెల్లారుజామున ఆ పిల్లతాలూకు వాళ్లు మా గుమ్మంలో ఏడుపు మొహాల్తో ప్రత్యక్ష మయ్యేరు."

"ఏడుపెందుకు? పిల్లకు దమ్మిడీ ఖర్చు లేకుండా పెళ్ళయినందుకు సంతోషించి ఊళ్లో వాళ్లకు అన్నదానం చేయక?''

''వాళ్లందుకు సిద్ధమే. కానీ వాళ్లు రోగజ్వాల నవల గానీ, రోగబంధం నవలగానీ చదవలేదు. కనీసం రోగహృదయాలు కూడా చదవలేదట. పిల్ల లేచిపోయింది! పరువు పోయింది! అని వాళ్ల బాధ.''

''పరువు. ఎక్కడ ఉంటుందది? ఎలా ఉంటుందేం?"

"దాని సంగతి తరవాత చూద్దాం! వీళ్లు వచ్చేసరికి మా బామ్మర్దిగాడూ. ఆ పిల్లా రోగోదయం నవల చదువుతూ మైమరచి ఉన్నారు. మా ఇంట్లో అటక లేదు. బాత్రూంలో

దాక్కోవచ్చని వాళ్ళు ఏ నవలలోనూ చదవలేదట. అందు కని తేలిగ్గా పెద్దలకు దొరికి పోయేరు."

"పాపం! మీవాడి ఒళ్లూ, ఆ పిల్ల హృదయమూ చిట్ల గొట్టి ఉంటారా రాక్షస హృదయులు!"

"అబ్బె! అదేం లేదు. తీసుకెళ్ళి మళ్ళీ శాస్త్రోక్తంగా వాళ్ళింటికీ, వీళ్ళింటికీ మధ్య ఉన్న రోడ్డంత పందిరేసి పెళ్లి జరిపించేరు. తర్వాత తీరిగ్గా కట్నం రేటు సెటిల్ చేసుకుని ఊటీ పంపించేరు."

"శెభాష్! వీళ్ళు ఇప్పుడు ఊటీలో కూర్చుని రోగంలో రంగులు, రోగ లహరిలాంటి ఉత్తమ నవలలన్నీ చదివేస్తుంటారను కుంటాను."

"ఏమోగానీ, మొత్తం మీద మా బామ్మర్ది టైపు పెళ్లంటే మాత్రం ఇదీ!"

నేను ఆలోచించేను. ఈ టైపు పెళ్లిళ్ల ఇన్విటేషన్లేవీ నాకు వచ్చినట్లు లేవు. ఆ మధ్య మా బంధువుల్లో ఓ లక్షాధికారి కొడుకు మరో లక్షాధికారి కూతుర్ని లవ్ చేశానంటే పెద్దలు సరేనని మూడుముళ్లూ బిగించి పారేశారేగానీ ఏ గొడవా జరగలేదు. పైగా మా కుర్రాడు చాలా తెలివైన వాడని అందరూ మెచ్చుకుని చాలా ప్రజంటేషన్లిచ్చారు. నేనూ రోగసుధ అని ఓ కిలోడు నవలని బహూకరించేను.

"నేను వెళ్లబోయేవన్నీ పెద్దల పెళ్లిళ్లేనేవోయ్," అన్నాను.

"పెద్దల పెళ్ళిళ్ళేమిటి సార్ ! మీ బంధువుల్లో పెళ్ళిళ్ళు గాని ముసలాళ్లు జాస్తీగా ఉన్నారా ?''

"అబ్బె ! అదిగాదు. పెద్దలు కుదిర్చి, పెద్దలుచేసే పెళ్ళిళ్లు లేవయ్యా !"

"అయితే అలాంటి పెళ్ళిళ్ళలో ఇలాంటి పుస్తకాలు ప్రెజెంట్ చేయటం బాగుంటుంది." అంటూ ఓ డజన్ పుస్తకాలు నా ముందుంచేడు.

నిజంగానే ఆ నవలలన్నీ లావుగా, పొలందాగా, నాలు గయిదు రంగుల అట్టలతో దర్జాగా ఉన్నాయి. వాటిని చదవకుండా ఎవరూ పకోడీల దుకాణంలో తూకం వేసెయ్యలేరు. చదివే ఓపిక లేకపోతే కనీసం డ్రాయింగ్ రూంలో అద్దాల బీరువాలో అలంకరించవలసినంత లావుగా, డాబుగా ఉన్నాయవన్నీ.

మా బుక్ స్టాల్ మిత్రుడు ఒకొక్క నవల ప్రాశస్త్యాన్ని నారు రేడియోవాళ్ళ సంక్షిప్త సినిమా శబ్దచిత్రాల పద్ధతిలో వర్ణించసాగాడు.

'చూడండి! ఈ రోగజ్యోతి నవల గొప్ప విషాదాంతం. ఇది చదివిన కొందరు కన్నీళ్లు తుడుచుకునేందుకు స్పెషల్‌గా టర్కిష్ టవల్స్ కొనుక్కున్నారట! గుండె జబ్బున్న వాళ్ళు కొందరు తపీమని చచ్చేరుట. ఇందులో హీరోయిన్ ఓ రిక్షా వాడి కూతురు. ఆవిడ ఓ లక్షాధికారిని లవ్ చేస్తుంది, అతడు కూడా ఆమెను వంద పేజీలదాకా లవ్ చేస్తాడు. ఆ తర్వాత

ఓ రెండు లక్షలాధికారిని లవ్ చేస్తుంది. అతడుకూడా ఈమెను వంద పేజీలదాకా లవ్ చేస్తాడు. ఆ తర్వాత ఓ రెండు లక్షలాధికారి కూతుర్ని పెళ్లాడతాడు. ఆర్నెల్ల పాటీమె కుమిలే గుండెతో, క్రుంగే మనసుతో యాభై పేజీలపాటు శోకిస్తుంది. రెండొందల పేజీలయ్యాక లక్షాధికారికి ఆక్సిడెంటులో రక్తం పోతే తన రక్తం ఇచ్చి రోగమయి నవల చదువుకుంటూ స్వర్గాని కెళ్ళిపోతుంది. ఆఖరి పేజీలో సదరు లక్షాధికారీ, అతని రెండు లక్షల భార్యా వాళ్ల డ్రాయింగ్ రూంలో ఈవిడ ఫోటోకు దండలువేసి ఏడుపు మొహాల్తో హారతి ఇస్తూ 'నీవు రిక్షాపిల్లవుగావు రోగజ్యోతివి' అంటూండగానే నవల అయిపోతుంది. అద్భుతం గదండీ!'

నిజమే! నా గుండె చాలా బరువెక్కిపోయింది. నాకు భయం వేయసాగింది. సంక్షిప్త నవలే ఇంత ఘాటుగా వుంటే మొత్తం నవల ఇంకెలా ఉంటుందోనని.

టేబుల్ మీది మిగతా నవలల్ని చూసేను. రోగవలయం, రోగరాగిణి, రోగవిపంచి, రోగనిలయం అంటూ అందంగా కొనమంటున్నా యవి.

ఇంతలో ఎవరో కస్టమర్ వచ్చేడు 'రోగబంధితులు' సిన్మా నవల ఉందాండీ' అంటూ!

సందు చూసుకుని నేను బయటికి జారుకున్నాను.

(జులై 1974)